

ఓటర్ల జాబితా సరిదిద్దింది ఎక్కడ?

పెనుమూరు, మార్చి 11: ఎన్నికల కమిషను ఎన్ని హెచ్చరికలు చేసినా.. అధికారులకు ఎన్ని ఫిర్యాదులు అందినా ఓటర్ల జాబితాలో సరిదిద్దలేదు. తుది జాబితాలోనూ తప్పులు కుప్పలుగా ఉన్నాయి. పెనుమూరు మండలంలోని బూత్ నంబరు 24లో ఓటరు జాబితానే దీనికి నిదర్శనం.

మృతులూ ఓటర్లే

ఓటరు జాబితాలోని వరుస సంఖ్య 868లో సుందరమ్మకు ఓటు హక్కు కల్పించారు. ఈమె చనిపోయి చాలా కాలమైంది. వరుస సంఖ్య 893లోనూ మృతుడు చెంగయ్యకు ఓటు హక్కు కల్పించారు.





అత్తారింటికి వెళ్లినా..

చాలా కాలం కిందట పెళ్లిళ్లయి అత్తారింటికి వెళ్లిన మహిళలనూ ఓటర్లుగా కొనసాగిస్తున్నారు. వరుస సంఖ్య 686లో పి.మాధవికి, 413లో పి.రేఖ, 414లో పాలమంగళం రీటా, 366వ నంబరులో రోజా, 235లో పల్లవి, 52 నంబరులో ప్రవళిక, 65వ నంబరులో రూపాకు వివాహాలై చాలాకాలమైనా ఓటుహక్కు కల్పించారు. ఇక, 112 వరుస నంబరులోని పి.డింపుల్ పెళ్లి చేసుకుని అమెరికా వెళ్లిపోయినా ఓటుంది.



ఓటర్ల జాబితాలో రేఖ, రీటా పేర్లు

ఊరొదిలి వెళ్లినా..

ఇదే బూత్‌లో కొందరు ఊరు వదిలి వెళ్లి బయటి ప్రాంతాల్లో స్థిరపడినా కూడా ఓటు హక్కు కల్పించారు. వరుస సంఖ్య 816లో జ్యోతమ్మ, 817లో చిట్టెమ్మ, 823లో ఎస్.మునిరాజు, 818లో ఎన్.రమాదేవి, 805లో బి.క్రిష్ణయ్య, 806లో ఎం.సరస్వతి, 710లో శ్రావ్య, 711లో వినిషా తిరుపతి, చిత్తూరు, ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. అయినా, వీరంతా ఇక్కడి పపోలింగ్ కేంద్రం పరిధిలో ఓటర్లే.

● ఇదే బూత్‌లో వరుస సంఖ్య 7లో చిట్టిబాబుకు స్థానికంగానే రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు ఉన్నా అతడి ఓటు తొలగించడం గమనార్హం.





ఊరొదిలి వెళ్లినా తొలగించని బి.క్రిష్ణయ్య, సరస్వతి, శ్రావ్య, వినిషా పేర్లు

నీకెంత.. నాకెంత



- వాటాలేసుకుని.. రూ.13 కోట్ల రోడ్డు పోరంబోకు స్థలాన్ని కొట్టేసిన వైనం
- అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది బంధువుల పేర్లపై పట్టాలు
- గంగవరంలో వెలుగు చూసిన భూబాగోతం

నీకెంత, నాకెంత.. అంటూ భాగాలేసుకున్నారు. రూ.13 కోట్ల విలువచేసే రోడ్డు పోరంబోకు స్థలాన్ని దిగమింగేందుకు ప్రణాళిక రచించారు. ఇలా.. అధికార పార్టీ సర్పంచి, ఎంపీటీసీ, రెవెన్యూ సిబ్బంది కుటుంబీకులు, బినామీల పేరిట పట్టాలు పొందారు. ఈ ఘటన గంగవరం మండలంలో సంచలనంగా మారింది.

- గంగవరం

పలమనేరు-మదనపల్లె రోడ్డును సుమారు ఐదేళ్ల కిందట విస్తరించారు. దీంతో గంగవరం పంచాయతీ పరిధిలో రోడ్డునూ విశాలంగా వేశారు. దీనికి తోడు బెంగళూరు- చెన్నై రహదారి బైపాస్ రోడ్డు కూడా గంగవరం మీదుగానే వెళ్తోంది. దీంతో గంగవరం పంచాయతీ పరిధిలో భూముల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఒక అడుగు రూ.1500 ఉన్న ధర.. రోడ్డు విస్తరణ తరువాత తర్వాత రూ.10,000 వరకు పలుకుతోంది. ఇంత మొత్తంలో వెచ్చించినా ఒక అడుగు స్థలం దొరకడం కష్టతరంగా మారింది. ఒకవిధంగా చెప్పాలంటే.. రియల్ ఎస్టేట్‌కు కేంద్ర బిందువుగా గంగవరం పేరు మార్మోగుతోంది. ఇందుకు అనుగుణంగానే రియల్ ఎస్టేట్ వ్యాపారులు పలమనేరు కన్నా గంగవరం వైపే మక్కువ చూపిస్తుంటారు. ఇంత డిమాండు ఉండటంతో ప్రభుత్వ స్థలాలు, ఖాళీ స్థలాలపై వైసీపీ నాయకుల బినామీల కన్ను పడింది. అంతే గంగవరంలో హైవేకు ఆనుకొని ఉన్న భూముల జాబితాను రెవెన్యూ అధికారుల నుంచి కొందరు తెప్పించుకున్నారు. ఆ ప్రకారం.. మదనపల్లె రోడ్డులోని ఫ్లైఓవర్ జంక్షన్‌లో సర్వే నెంబరు 319లో ఉన్న రోడ్డు పరంబోకు భూమిపై కన్నేశారు. రెవెన్యూ అధికారులను కలిసి మాట్లాడారు. ఈ సర్వే నెంబరు రోడ్డు పోరంబోకు జాబితాలో ఉందని, పట్టాలు ఇవ్వడం కుదరదని వారు తేల్చిచెప్పారు. అయినా వీరు వదల్లేదు. కొందరు అధికారులపై రాజకీయ ఒత్తిడి తెచ్చి.. ప్రలోభ పెట్టి దారికి తెచ్చుకున్నారు. వెంటనే ఆ రెవెన్యూ అధికారుల సూచనల మేరకు.. వైసీపీకి చెందిన సర్పంచి, ఎంపీటీసీ, వీఆర్వో కుటుంబ సభ్యుల పేరిట మీ సేవా కేంద్రం ద్వారా దరఖాస్తు చేయించారు. ఈ దరఖాస్తులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన వెంటనే ఆగమేఘాలపై స్పందించి.. రోడ్డుపోరంబోకు స్థలానికి పట్టాలు మంజూరు చేసేశారు. ఈ భూమి విలువ రూ.13 కోట్లు ఉంటుంది.

పట్టాలు పొందిన వారిలో..

మనదేం పోతుందిలే అనే ధోరణితో పాలకులతో కలసి కొందరు రెవెన్యూ ఉద్యోగులూ వారి బినామీల ద్వారా చేతులుకలిపి పట్టాలు పొందినట్లు ఆరోపణలున్నాయి. ఈ స్థలానికి పట్టాల కోసం కె.ఈశ్వరమ్మ, బి.మొగిలమ్మ, టి.గౌరమ్మ, టి.వళ్లెమ్మ, టి.రాణెమ్మ, టి.చంద్రమ్మ, రాధమ్మ, సి.మునీశ్వరి, టి.పద్మమ్మ, ఎం.వెంకటలక్ష్మమ్మ, టి.ఈశ్వరమ్మ, టి.పార్వతమ్మ పేర్లతో దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా సర్పంచ్ కుటుంబసభ్యులతో పాటు, ఎంపీటీసీ, రెవెన్యూ కార్యాలయ సిబ్బంది మనుషులన్న ప్రచారం సాగుతోంది. ఇలా 12 మందికి పట్టాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియ కోసం ఒక్కొక్కరి వద్ద రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల చొప్పున వసూలు చేసినట్లు సమాచారం. ఇలా రూ.50 లక్షల వరకు చేతులు మారినట్లు ఆరోపణలున్నాయి.

అవునా.. ఇప్పుడే తెలుసుకుంటా

రోడ్డుపోరంబోకు స్థలానికి పట్టాలు ఇచ్చిన విషయమై నాకు కలెక్టర్ కార్యాలయం నుంచీ ఫోను వచ్చింది. అయితే ఆ సర్వే నెంబరు రోడ్డు పోరంబోకు స్థలంగానే ఉంది. రికార్డుల్లో పట్టాలు ఇచ్చారేమో చూస్తా. ఇప్పుడే తెలుసుకుంటా.

- లోకేశ్వరరావు, తహసీల్దారు



వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద గుమికూడిన వైసీపీ కార్యకర్తలు

వైసీపీ కార్యకర్తల డిష్యుం.. డిష్యుం

చిత్తూరు, మార్చి 11: చిత్తూరులో ఇద్దరు వైసీపీ కార్యకర్తలు కొట్టుకున్నారు. తీవ్రస్థాయిలో ఘర్షణ పడ్డారు. వీరిద్దరూ వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డి, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి అనుచరులు కావడం గమనార్హం. వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి రాజేష్‌కుమార్‌రెడ్డి అనుచరుడు అఖిల్.. విజయానందరెడ్డి మనిషి మురళి ఓ టిఫిన్ సెంటర్ వద్ద ఘర్షణ పడ్డారు. గతంలో మురళి ఏర్పాటుచేసిన ఫ్లెక్సీని అఖిల్ చించేశాడనే అనుమానమే ఈ ఘర్షణకు కారణంగా తెలుస్తోంది. ఈ విషయంగానే సోమవారం మరోసారి ఇద్దరి మధ్య వివాదం చెలరేగింది. పరస్పరం కొట్టుకున్నారు. దీంతో ఒకరిపై మరొకరు వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. వారి అనుచరుల కోసం విజయానందరెడ్డి, రాజేష్‌కుమార్‌రెడ్డి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. సీఐ విశ్వనాథ్‌రెడ్డితో మాట్లాడి సర్దుబాటు చేసుకుని అనుచరుల్ని తీసుకెళ్లారు. విజయానందరెడ్డి కార్యాలయంలో సర్దుబాటు చేసుకున్నట్లు సమాచారం. సోమవారం సాయంత్రం రాజేష్‌కుమార్‌రెడ్డి ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి.. 'ఇద్దరు యువకులు గొడవ పడితే దాన్ని వర్గాలుగా ముద్ర వేయొద్దు. అందరం విజయానందరెడ్డి వర్గమే' అని పేర్కొన్నారు.

నగరిలో వీధికుక్క వీరంగం

● చిన్నారికి తీవ్రగాయాలు



నగరి, మార్చి 11: నగరి పట్టణం పెరుమాళ్‌గుడి వీధిలో కుక్క వీరంగంతో 18 నెలల బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. సోమవారం ఉదయం 9 గంటల సమయంలో ఇంట్లో నుంచి వీధిలోకి వచ్చిన చిన్నారిని కుక్క ఎనిమిదిచోట్ల కరిచింది. చిన్నారి వాసు అరుపులకు పరుగెత్తుకొచ్చిన తల్లి కుక్కను తరిమి.. స్థానికుల సాయంతో బిడ్డను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం ఏరియా వైద్యశాలకు తరలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి పద్మావతినగర్, పెరుమాళ్‌గుడి వీధి, రన్నాలవీధి, జనపవీధిలో కుక్కలు అధికంగా ఉన్నాయని, వాటిని పట్టి దూరప్రాంతాలకు తరలించాలని కోరారు. వెంటనే ఆయన మున్సిపల్ సిబ్బందిని పంపి మూడు కుక్కలను పట్టించినట్లు స్థానికులు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు జ్యోతినాయుడు, గుణశేఖర్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

● పుంగనూరు అధికారుల సమీక్షలో కలెక్టర్ హెచ్చరిక



వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను పరిశీలిస్తున్న కలెక్టర్

పుంగనూరు, మార్చి 11: పుంగనూరు నియోజకవర్గంలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ షన్మోహన్ ఆదేశించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. నియోజకవర్గపరిధిలో అధికారుల పనితీరును ఎన్నికల పరిశీలకులు క్షుణ్ణంగా పరిశీలిస్తారని చెప్పారు. ఎవరూ విధుల్లో నిర్లక్ష్యం వహించరాదని, పొరబాట్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన వెంటనే మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ (ఎంసీసీ) అమల్లో ఉంటుందని స్పష్టంచేశారు. ప్రతి కార్యాలయంలో ప్రభుత్వ అభివృద్ధికి సంబంధించి ఫొటోలు, బ్యానర్లు తొలగించాలన్నారు. జిల్లా కేంద్రంలోను కంట్రోల్ రూమ్ ఉంటుందని.. నియోజకవర్గ స్థాయిలోనూ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కంట్రోల్ రూమ్ నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిశీలించి రిపోర్టును ఆర్‌వో ద్వారా జిల్లా ఎన్నికల అధికారికి పంపాలన్నారు. సీ విజిల్‌యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను 100 నిమిషాల వ్యవధిలోనే పరిశీలించి నివేదికను జిల్లా ఎన్నికల అధికారి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి అదే రోజు పంపాలని సూచించారు. అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మౌళిక సదుపాయాలు, ఇంటర్నెట్ సౌకర్యంపై ఏఈఆర్‌వోలు పరిశీలించి నివేదిక పంపాలన్నారు. ఎన్నికల సమయంలో ఎవరికీ సెలవులు ఇవ్వొద్దన్నారు. ఓటర్లకు డబ్బులు, మద్యం, ఆర్టికల్స్ పంపిణీ చేస్తే వీడియో తీయాలన్నారు. కాగా, ఈవీఎంలను భద్రపరచడానికి పట్టణ సమీపంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో స్ట్రాంగ్ రూములు, రిసెప్షన్ సెంటర్లను ఆయన పరిశీలించారు. జేసీ శ్రీనివాసులు, పుంగనూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మధుసూదన్‌రెడ్డి, డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ శివయ్య, మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో మునిరెడ్డి, ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా, గంగాధరనెల్లూరు, కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లోనూ ఎన్నికల నిర్వహణపై ఆయా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.





ముసలిమడుగు అటవీ ప్రాంతంలో ఏనుగుల ఫాడర్ కోసం సిద్ధం చేసిన అటవీ భూమి - నీటి వసతి కోసం తవ్విన కుంటలు

ఏనుగులకు మేత, నీళ్లకోసం..

పలమనేరు, మార్చి 11: పలమనేరు మండలం ముసలిమడుగు అటవీ ప్రాంతంలో ఏనుగులకు ఆహారం, నీటి వసతి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. పలమనేరు అటవీ ప్రాంతంలోని ఏనుగులు ఆహారం, తాగునీటి కోసం సరిహద్దు ప్రాంతాల్లోని పంటపొలాలను నాశనం చేస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఏనుగులకు కావాల్సిన నీటి వసతి, ఆహారం అటవీ ప్రాంతంలోనే లభ్యమయ్యేలా చర్యలు తీసుకొంటే చాలావరకు ఏనుగుల దాడులను అరికట్టవచ్చని అటవీశాఖ అధికారులు భావించారు. ఇందుకోసం ప్రయోగాత్మకంగా పలమనేరు మండలం మొసలి మడుగు అటవీ ప్రాంతంలో సుమారు 12 హెక్టార్లలో అటవీ మొక్కలను తొలగించి ఆ భూమిలో ఏనుగులకు కావాల్సిన ఆహారాన్ని సమకూర్చేందుకు పనులు చేపట్టారు. అంతేకాక ఏనుగులకు నీటి వసతి కోసం మూడు కుంటలను కూడా నిర్మించారు. తుంటరి ఏనుగులను అదుపు చేసేందుకు కొన్నిరోజులపాటు నిర్బంధించేందుకు వీలుగా యూకలిప్టస్ కర్రలతో చెరసాలను కూడా ఏర్పాటు చేశారు. ఏనుగులకు కావాలసిన ఆహార పంటలను సాగుచేయాలంటే నీటి వసతి ఉండాల్సిందే. బోరుబావుల నిర్మాణానికి, మోటర్ల ఏర్పాటుకు, విద్యుద్దీకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్లు సమాచారం.



ఏనుగులను నిర్బంధించేందుకు కొయ్య చెరసాల

పంచలోహ విగ్రహాలపై కలెక్టరుకు నివేదిక




గర్భగుడి తవ్వకాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

పలమనేరు, మార్చి 11: పలమనేరు మండలం కూర్మాయి వరదరాజ స్వామి ఆలయ జీర్ణోద్ధరణలో భాగంగా గర్భగుడి తవ్వకాలలో బయటపడిన పంచలోహ విగ్రహాలపై కలెక్టరుకు నివేదిక పంపుతున్నామని తహసీల్దార్ చెంగల్రాయలు తెలిపారు. సోమవారం ఆయన సిబ్బందితో కలిసి ఆలయ జీర్ణోద్ధరణ పనులను పరిశీలించారు. గ్రామస్తులను అగిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం గర్భగుడిలోని మూల విగ్రహం ఉంచిన గదిలోనే భద్రపరిచిన పంచలోహ విగ్రహాలను గ్రామస్తులు ఆయనకు చూపించారు. చాలా విలువైన విగ్రహాలను జాగ్రత్తగా ఉంచాలని తహసీల్దారు సూచించారు. ఈ విషయమై తాను కలెక్టరుకు నివేదిక పంపిస్తానని, ఆయన ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రంజాన్ వేళలు

మంగళవారం : ఇఫ్తార్ : సాయంత్రం -6.28

బుధవారం : సహర్ : ఉదయం -5.02



కేజీబీవీల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు (సెంట్రల్), మార్చి 11: జిల్లాలోని ఎనిమిది కేజీబీవీ పాఠశాలల్లో సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతి, ఇంటర్‌లో చేరేందుకు మంగళవారం నుంచి ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 6వ తరగతిలో 320, ఇంటర్ మొదటి సంవత్సరంలో 320, 7వ తరగతిలో మూడు, 8వ తరగతిలో నాలుగు, 9వ తరగతిలో ఆరు చొప్పున 653 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 513 మంది గైర్హాజరు

ఇంటర్మీడియట్ సెకండియర్ పరీక్షల్లో భాగంగా సోమవారం మ్యాథ్స్ 2బి, జువాలజీ, హిస్టరీ పేపర్ 2 పరీక్షలకు 513 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీవీఈవో సయ్యద్ మౌల తెలిపారు. 10609 మంది విద్యార్థులకు గాను 10,093 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.

కళ్యాణం కమనీయం


పెండ్లిమండపం వద్ద వధూవరుల అలంకరణలో ఆది దంపతులు

- ఆది దంపతుల వివాహ వేడుకలతో శోభిల్లిన శ్రీకాళహస్తి
- అదే ముహూర్తాన ఒక్కటైన 30 జంటలు


అశేషభక్త జనం మధ్య కళ్యాణోత్సవ పూజలు



శ్రీకాళహస్తి, మార్చి 11: గజవాహనంపై వరుడిగా శివయ్య ... సింహవాహనంపై సిగ్గులొలుకుతూ పార్వతమ్మ కల్యాణోత్సవ వైభవంతో శ్రీకాళహస్తి క్షేత్రం పరవశించింది. మహాశివరాత్రి ఉత్సవాల్లో స్కంధరాత్రిని పురస్కరించుకుని ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు... మేళ తాళాలు... కళాకారుల ఆటపాటల మధ్య ఆదివారం అర్ధరాత్రి వివాహ వేదిక వద్దకు కోలాహలంగా తీసుకువచ్చారు. చతుర్వేద పారాయణం పూర్తయ్యాక సప్తపది కార్యక్రమం ఆగమోక్తంగా ప్రారంభమైంది. ఆలయ అనువంశిక ప్రధాన దీక్షా గురుకుల్ స్వామినాథన్, వరద, నిరంజన్ గురుకుల్ సారథ్యంలో సప్తపది విశేషోత్సవాన్ని వేదోక్తంగా నిర్వహించారు. స్కందుడి జననం కోసం నిర్వహించిన కళ్యాణోత్సవ ఘట్టంలో చండికేశ్వర రాయబార పర్వం రక్తికట్టించింది. హిమవంతుడి కుమార్తె అయిన పార్వతీదేవికి, పరమేశ్వరుడికి పరిణయం నిశ్చయం చేసేందుకు బ్రహ్మ, విష్ణువులతో పాటు ఇంద్రాది సకల దేవతలు తరలివచ్చారు. జగద్రక్షకుడైన స్వామివారు చిటికెడు విభూది, ఒక్క బిల్వపత్రం కట్నంగా ఇచ్చేలా రాయబారం కొనసాగింది. ఉదయం 5 గంటల సమయంలో మాంగల్యధారణ కార్యక్రమం పూర్తి చేశారు. ఇదే ముహూర్తంలో 30 జంటలు పెండ్లి మండపం వద్ద వివాహంతో ఒక్కటయ్యాయి. అంతకు ముందు వధూవరులకు ముక్కంటి ఆలయం తరపున మంగళ సూత్రాలు,పసుపు, కుంకుమ, గాజులు, దుస్తులు అందజేశారు.శివపార్వతుల కళ్యాణ మహోత్సవం వీక్షించేందుకు వచ్చిన భక్త జనంతో నగిరి వీధి, నెహ్రూ వీధి నిండిపోయాయి. అనంతరం ఆది దంపతులు నారద పుష్కరిణీ, విజ్ఞానగిరి, ఆ తరువాత పురవీధుల్లో ఊరేగి భక్తులకు నవ దంపతులుగా దర్శమిచ్చారు. ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు, పూర్వ ఈవో రామారావు తదితరులు పాల్గొన్నారు.

నయనానందకరం... నటరాజ కల్యాణోత్సవం

సకల శాస్త్రాలకు ఆదిగురువైన నటరాజు, శివకామ సుందరి పరిణయోత్సవం సోమవారం రాత్రి ఆద్యంతం రమణీయంగా సాగింది. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆనందరాత్రిని పురస్కరించుకుని శివకామ సుందరి సమేత నటరాజస్వామికి జరిపిన


మాంగల్యం చూపుతున్న ప్రధాన అర్చకుడు

ఈ కల్యాణోత్సవం సందర్భంగా ఉత్సవమూర్తులను ఆలయ ఆవరణలోని ఆస్థాన మండపానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయ అనువంశిక ప్రధాన దీక్షా గురుకుల్ డాక్టర్ స్వామినాథన్ ఆధ్వర్యంలో ఘనంగా పూజాది కార్యక్రమాలు జరిపారు. చివరిగా యాగకలశంలోని పవిత్రజలంతో ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించారు. మేళతాళాలు, భక్తుల జయజయ ధ్వానాలమధ్య ప్రధాన అర్చకులు మాంగల్యధారణ చేపట్టారు. అనంతరం ఉత్సవమూర్తులను పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు.సోమవారం ఉదయం ఆదిదంపతులు రుద్రాక్ష చప్పరాలపై పురవిహారం చేశారు.

'లక్‌పతి దీదీ' కింద రూ.150.14 కోట్లు


ప్రశంసా పత్రాలు పొందిన మహిళా సంఘాల సభ్యులతో డీఆర్‌డీఏ పీడీ తులసి

చిత్తూరు (సెంట్రల్), మార్చి 11: ప్రధాన మంత్రి మోదీ 'లక్‌పతి దీదీ' కార్యక్రమంలో భాగంగా సోమవారం దేశవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల సభ్యులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చిత్తూరులోని కలెక్టరేట్ నుంచి డీఆర్‌డీఏ పీడీ తులసితో పాటు స్వయం సహాయక సంఘాల సభ్యులు హాజరయ్యారు. కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా లక్‌పతి దీదీ కార్యక్రమం ద్వారా జిల్లాలోని 1419 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.150.14 కోట్లను చెక్కుల రూపంలో పీడీ అందించారు. జీవనోపాధులను ఎంచుకుని ఆర్థికంగా స్థిరపడిన మహిళా సభ్యులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

నోడల్ అధికారులకు ఎన్నికలపై కలెక్టర్ దిశానిర్దేశం

చిత్తూరు (సెంట్రల్), మార్చి 11: కమిషన్ నిబంధనల మేరకు సార్వత్రిక ఎన్నికల విధులను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షన్మోహన్ పేర్కొన్నారు. సోమవారం డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో జేసీ శ్రీనివాసులుతో కలిసి సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లు చేసిన విభాగాల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల విభాగాల్లో భాగంగా మీడియా మేనేజ్‌మెంట్, ఎంసీఎంసీ, సోషల్ మీడియా యూనిట్లు, కంప్లైయింట్, మానిటరింగ్ సెల్, 1950 కాల్ సెంటర్, ఎస్ఎస్‌జీపీ యూనిట్, ఎంసీసీ మానిటరింగ్ యూనిట్ తదితర విభాగాల నోడల్ అధికారులకు ఎన్నికల కోడ్ సమయంలో నిర్వహించాల్సిన విధులపై వివరించారు. విభాగాల నోడల్ అధికారులు నియోజకవర్గాల సిబ్బందితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. నివేదికలను నిర్దేశిత కాలంలో తప్పని సరిగా పంపాలని, ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని హెచ్చరించారు. సమావేశంలో నోడల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అడవిలో యువకుడి హత్య

పలమనేరు, మార్చి 11: పలమనేరు సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయ అటవీ ప్రాంతంలో పెద్దపంజాణి మండలం శివాడి గ్రామానికి చెందిన వినయ్(30) దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం మేరకు ... ఈనెల 8వ తేదీ అర్ధరాత్రి సమయంలో పలమనేరు మండలం బోడిరెడ్డిపల్లికి చెందిన వివాహిత, కొలమాసపల్లి పంచాయతీ కూరుమాయి గ్రామానికి చెందిన యువకుడు ఆంజనేయస్వామి ఆలయ సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లారు. అదే సమయంలో వినయ్ కూడా ఆ ప్రాంతంలోనే తిరుగుతూ వీరిద్దరిని చూశాడు. వినయ్ తన వద్ద ఉన్న బీరు బాటిల్‌తో యువకుడిపైకి దాడి చేసేందుకు ప్రయత్నించినట్లు తెలిసింది. రాత్రివేళ ఒంటరిగా వెళ్తున్నందున తన రక్షణ కోసం కూరుమాయి గ్రామానికి చెందిన యువకుడు తన వెంట తీసుకు వెళ్లిన ఇనుపరాడ్‌తో వినయ్‌పై దాడిచేయగా, యువకుడి వెంటవెళ్లిన వివాహిత కూడా ఈ దాడిలో పాల్గొనడంతో వినయ్ తలకు బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే చనిపోయాడు. వివాహితతోపాటు కూరుమాయి యువకుడు పారిపోయారు. వినయ్ హత్యకు గురైన విషయం సోమవారం వెలుగులోకి రావడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు.కాగా శనివారం రాత్రి హత్యానంతరం వివాహితతో కలిసి కూరుమాయి యువకుడు పారిపోవడంతో వివాహిత భర్త తన భార్య కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై పోలీసులు ఆరా తీయడంతో కూరుమాయి యువకుడితో ఉన్న సాన్నిహిత్యంతో వీరిద్దరూ వినయ్‌ను హత్యచేసి పారిపోయినట్టు నిర్ధారించుకున్నట్లు తెలిసింది. సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష

చిత్తూరులీగల్, మార్చి 11: దొంగతనం కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. బంగారుపాళ్యం మండలం ఊటువంక గ్రామానికి చెందిన గిరి ఇంట్లో 2023 ఫిబ్రవరిలో తమిళనాడు రాష్ట్రం మదినేపల్లెకు చెందిన మురళి బంగారు నగల దొంగతనం చేశాడు. దీనిపై బంగారుపాళ్యం పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసు సోమవారం ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి కోర్టులో వాయిదా ఉండింది. కేసు పూర్వాపరాలు పరిశీలించాక మురళిపై నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి ఉమాదేవి మూడేళ్ల జైలు శిక్ష, రూ.వంద జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జన్మదిన వేడుకలు

చంద్రగిరి, మార్చి11: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధర రావు జన్మదిన వేడుకలు సోమవారం తిరుపతిలో ఘనంగా జరిగాయి. చిన్నారుల మధ్య జరిగిన ఈ వేడుకల్లో పలువురు టీడీపీ నాయకులు పాల్గొని హేమాంబరధరరావుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిన్నారులతో కేక్ కట్ చేయించి అందరికీ పంచిపెట్టారు. చంద్రగిరి మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, నాయకులు గౌస్‌బాషా, ముండ్లూరి బాలకృష్ణమూర్తి, నగరం రమేష్ తదితరులు పాల్గొన్నారు.



బాల మేధావులే.. భావి శాస్త్రవేత్తలు

- గంగవరంలో 'రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్' ప్రారంభం



రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్‌ను ప్రారంభిస్తున్న అధికారులు - నమూనాలను తిలకిస్తున్న విద్యార్థులు

గంగవరం, మార్చి 11: నేటి బాల మేధావులే రేపటి భావితరాల శాస్త్రవేత్తలని డీఈవో దేవరాజులు పేర్కొన్నారు. గంగవరం సమీపంలోని మదర్ థెరీసా కళాశాలలో 'రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ మనక్' ఎగ్జిబిషన్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోలార్ సిస్టమ్, రోడ్ల మరమ్మతులు, వాతావరణ కాలుష్య నివారణకు మార్గాలు, పలు యాంత్రీకరణ నమూనాలతో వివిధ జిల్లాల విద్యార్థులు ఆకట్టుకున్నారన్నారు. 23 జిల్లాల నుంచి 306 బృందాలు ఈ ఎగ్జిబిషన్‌కు వచ్చినట్లు చెప్పారు. ఈ ప్రయోగాలను వీక్షించిన విద్యార్థులు టెక్నికల్ పాయింట్స్ తెలుసుకొని సరికొత్త ప్రయోగాలతో దేశానికి ఉపయోగపడేలా తయారుకావాలని పిలుపునిచ్చారు. న్యాయ నిర్ణేతలు ఎంపిక చేసిన నమూనాలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వెంకటరమణారెడ్డి, డీవైఈవో చంద్రశేఖర్, ఎంఈవోలు వేణుగోపాల్, శ్రీనివాసులు, మునెప్పమొదలి, పరశురామ్‌తోపాటు పలు జిల్లాల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి నుంచి పలు రైళ్ల రద్దు

తిరుపతి సెంట్రల్, మార్చి11 : తిరుపతి రైల్వేస్టేషన్‌లో ఆధునికీకరణ పనుల కారణంగా సోమవారం నుంచి పలు రైళ్లు రద్దు చేసినట్లు, మరికొన్ని దారి మళ్లించినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. వాటి వివరాలు ఇలా ఉన్నాయి..

- పాండిచ్చేరి-తిరుపతి మధ్య నడుస్తున్న (16112-16111)రైళ్లను ఈనెల 24వ తేదీ వరకు రద్దు చేశారు.
- తిరుపతి-మంగళూరు మధ్య నడుస్తున్న వారాంతపు రైలును (174070) ఈనెల 15 వరకు రద్దు చేశారు.
- తిరుపతి-అరక్కోణం మధ్య నడిచే (06753-06754), చెన్నై-తిరుపతి మధ్య నడుస్తున్న (06728-06727) ప్రత్యేక రైళ్లను తిరుపతి నుంచి రేణిగుంట మధ్య 14వ తేదీ వరకు రద్దు చేశారు.
- తిరుపతి-చెన్నై మధ్య నడుస్తున్న రోజువారి ఎక్స్‌ప్రెస్‌లు(16057-16058, 16054-16053) 23వ తేదీ వరకు రద్దు చేశారు. ఈ నాలుగు రైళ్లు రేణిగుంట-చెన్నై మధ్య రాకపోకలు సాగిస్తాయి.
- నిజాముద్దీన్-త్రివేంద్రం మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్(12644) ఈ నెల 15 నుంచి 22వ తేదీ వరకు తిరుపతికి రాకుండా రేణిగుంట నుంచి అరక్కోణం, కాట్పాడి మీదుగా రాకపోకలు సాగిస్తుంది.
- నిజాముద్దీన్-ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్(12646) మంగళవారం నుంచి 19వ తేదీ వరకు రేణిగుంట, అరక్కోణం, కాట్పాడి మీదుగా రాకపోకలు సాగిస్తుంది.
- బెంగళూరు నుంచి టాటానగర్, హటియాల మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్‌లు 21వ తేదీ వరకు రేణిగుంట, అరక్కోణం, కాట్పాడి మీదుగా నడుస్తాయి.
- కాచిగూడ-మధురై మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్(07191) ఈ నెల 18వ తేదీ వరకు రేణిగుంట, అరక్కోణం, కాట్పాడి మీదుగా నడుస్తుంది.

పోలీసు స్పందనకు 30 వినతులు


బాధితుల సమస్యలను వింటున్న ఏఎస్పీ అరీఫుల్లా

చిత్తూరు, మార్చి 11: చిత్తూరు నగరంలోని ఏఆర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'స్పందన' కార్యక్రమానికి 30 వినతులు వచ్చాయి. ప్రజల సమస్యలను విని వారి నుంచి ఏఎస్పీ అరీఫుల్లా అర్జీలను స్వీకరించారు. అధికారుల దృష్టికి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. స్పందనకు వచ్చిన సమస్యల్లో.. భూ తగాదాల కింద 11, కుటుంబ తగాదాలు 8, డబ్బు తగాదాలు 4, దారి తగాదాలు 4, వేధింపులు 2, ఇంటి తగాదా కింద ఒకటి వంతున ఉన్నాయి. దిశ డీఎస్పీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచుల పోరుబాట

- పంచాయతీరాజ్ చాంబర్ . ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి



తిరుపతి కలెక్టరేట్ వద్ద పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో సర్పంచుల ఆందోళన

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 11: ఏపీ సర్పంచుల సంఘం, ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా సర్పంచులు పోరుబాట పట్టారు. తమ 16డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్‌చేస్తూ సోమవారం భారీ ర్యాలీగా తిరుపతి కలెక్టరేట్‌కు చేరుకుని ఆందోళనకు దిగారు.జగన్ ఓడితేనే మన మనుగడ అనే నినాదంతో అన్ని పార్టీలకు చెందిన సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కౌన్సిలర్లు, ఎంపీపీలు వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడానికి కృషి చేయాలని పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు వైవీబీ రాజేంద్ర ప్రసాద్ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మన విధులు, నిధులు దోచేసిన జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఓడించండని కోరుతూ సర్పంచులు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేయాలన్నారు.పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య,జిల్లా పంచాయతీ రాజ్ ఛాంబర్ అధ్యక్షుడు ధనంజయయాదవ్ మాట్లాడుతూ సర్పంచులకు తెలియకుండా వారి ఖాతాల్లో నిధులను జగన్ ప్రభుత్వం దొంగలించిందని.. దీంతో గ్రామాల్లో బ్లీచింగ్ చల్లడానికి కూడా డబ్బుల్లేవని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్‌ను ఓడించి గ్రామాల అభివృద్ధికి తోడ్పాటునందించే సీఎంను ఎన్నుకుందామన్నారు. సిద్ధం అనే నినాదంతో ఎన్నికల ప్రచారానికి వచ్చిన జగన్ గడచిన మూడేళ్లుగా సర్పంచుల ఆందోళన చేస్తుంటే చర్చలకు మాత్రం సిద్ధం కాలేదని విమర్శించారు.సర్పంచుల సంఘం 16 డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని లేనిపక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ప్రతాపరెడ్డి, ప్రకాష్‌నాయుడు, చింతా కిరణ్‌యాదవ్, జనార్దన గౌడ్, రాము, మురళి, కొత్తపు మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెంగళూరు, రాజమండ్రికి ప్రత్యేక బృందాలు..

బాలుడి కిడ్నాప్ కేసులో ముద్దాయికి రిమాండ్

తిరపతి(నేరవిభాగం), మార్చి11 : తిరుమలలో మూడేళ్ల బాలుడి కిడ్నాప్ కేసులో నిందితురాలు ఇజ్జాడ దేవికి తిరుపతి రెండవ అదనపు మున్సిఫ్ మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించినట్లు తిరుమల టూటౌన్ సీఐ సత్యనారాయణ చెప్పారు. ఈమెపై గతంలో ఏమైన కేసులు ఉన్నాయా? నేర చరిత్ర ఏమైనా ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆమె భర్త మధు బెంగళూరులోని ఒక బేకరీలో పనిచేస్తున్నాడు. అతన్ని విచారించడానికి బెంగళూరుకు ప్రత్యేక బృందాలు వెళ్లాయి. మరోవైపు ఆమె ఉంటున్న రాజమండ్రి, రాజానగరంలో ఇతరత్రా వివరాలు తెలుసుకోవడానికి ప్రత్యేక బృందాలను పంపారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ఉజ్వల భవిష్యత్తు

- ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రరెడ్డి


హేమచంద్రరెడ్డిని సన్మానిస్తున్న వీసీ భారతి, రిజిస్ట్రార్ రజని

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 11: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉందని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రరెడ్డి పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశంపై పద్మావతి మహిళా యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యా రంగంలోనూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ప్రాముఖ్యత పెరిగిందన్నారు. ఇందులో ప్రతిభ గల విద్యార్థులకు ఉన్నత ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. విద్యాసంస్థలు విద్యార్థులకు విధిగా బోధించి వారి ప్రతిభకు మెరుగులుదిద్దే విషయంపై దృష్టి సారించాలని కోరారు. ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఉమామహేశ్వరిదేవి మాట్లాడుతూ విద్యారంగంలో ఎన్నో మార్పులు వస్తున్నాయని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ బోధనాంశంగా మారడమే నిదర్శనమని అన్నారు. పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అంతర్జాతీయ సదస్సుకు యూనివర్సిటీ వేదిక కావడం మంచి పరిణామమన్నారు. రిజిస్ట్రార్ రజని మాట్లాడుతూ ఈ అంశంపై అర్థవంతమైన చర్చ సాగి, మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఏకి చెందిన జినామిక్స్ బయోటెక్ ప్రతినిధి అలోక్ పాండే, మలేషియా యూనివర్సిటీ ప్రతినిధి హసీనా కరీమా, సదస్సు నిర్వాహకులు ఉష, భార్గవి పాల్గొన్నారు.

దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్న పాలకులు

- మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్ విమర్శ

కుప్పం, మార్చి 11: కుప్పం నియోజకవర్గంలో దళితుల ఆత్మగౌరవాన్ని ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్‌లు దెబ్బతీస్తున్నారని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమల సుదర్శన్ విమర్శించారు. కుప్పంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామకుప్పంలోని శివాజీనగర్‌లో గతేడాది అంబేడ్కర్ విగ్రహావిష్కరణను పాలకవర్గ పెత్తందార్లు, పోలీసులు అడ్డుకోవడానికి ప్రయత్నిస్తే, దళిత మహిళలు వీరోచిత పోరాటం చేసి పని పూర్తి చేశారన్నారు. అయితే స్థానిక అగ్రకులస్థులు ఓర్వలేక ఉయ్యాలవాడ నరసింహారెడ్డి శిలాఫలకాన్ని అంబేడ్కర్ విగ్రహం పక్కనే ఏర్పాటు చేసి వివాదానికి తెరదీశారని విమర్శించారు. నాడు పోలీసులు విధించిన 144 సెక్షన్ అమల్లో ఉండడం దారుణమన్నారు. అంబేడ్కర్ వర్ధంతి రోజున ఆయన విగ్రహానికి పూలమాల వేయడానికి ప్రయత్నించిన వ్యక్తిపై అక్రమంగా కేసులు పెట్టి జైలుకు పంపడం అన్యాయమన్నారు. సమస్యను పరిష్కరించి, అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించడానికి దళితులకు స్వేచ్ఛ ప్రసాదించాలని కోరినా ఎంపీ రెడ్డెప్ప కానీ, ఎమ్మెల్సీ భరత్ కానీ కనీసం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ఈ సమావేశంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు కందస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.కన్నన్, కార్యదర్శి కలైసెల్వం, విజయకుమార్, సి.మునస్వామి, అన్నమయ్య జి.మనోహర్, చంద్రయ్య పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



మాట్లాడుతున్న సీడీపీవో ఇందిరాప్రియదర్శిని

పలమనేరు, మార్చి11 : మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని పలమనేరు సీడీపీవో ఇందిరాప్రియదర్శిని పేర్కొన్నారు. సోమవారం పలమనేరులో జరిగిన మహిళా దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ భ్రూణ హత్యలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అంగన్ వాడీ వర్కర్లు, హెల్పర్లపై వుందన్నారు. గ్రామీణ మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు మహిళా హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ద్రాక్షాయిణి, నజ్మా, పుష్ప, శారద, సునీత గీత, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు. అలాగే పలమనేరు కాకాతోపు ఉర్దూ పాఠశాలలో సోమవారం మహిళాదినోత్సవం జరుపుకొన్నారు. ఆప్టా ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆప్టా జిల్లా నాయకులు మునాఫ్, పాఠశాల ఉపాధ్యాయినిలు జరీనా, బషీరున్నీసా, షాహిబాను, ముబీనా, మాలిన్, నౌహీరా, అమరీన్, రూహినాజ్, అశ్విని, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలని వినతి



పలమనేరు, మార్చి11 : గంగవరం మండలం మదనపల్లి రోడ్డుపక్కన ఆక్రమణలకు గురవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ సోమవారం స్పందన కార్యక్రమంలో టీడీపీ నాయకులు సోమశేఖర్ తదితరులు ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. గుండుబావి నుంచి మబ్బువాళ్లపేట వరకు రోడ్డుపక్కన ఇరువైపులా ఉన్న రోడ్డు పోరంబోకు భూములు, వాగు పోరంబోకు భూములు, ప్రభుత్వ భూములకు సంబంధించిన సదరు సర్వేనంబర్లు 383, 401, 319, 320లో గల భూములను కాపాడాలన్నారు. ఈ భూములకు వైసీపీ నాయకులు నకిలీ అనుభవ పత్రాలు సృష్టించుకుని తమ పేరుమీద పత్రాలను మార్పులు చేసుకొన్నారని పేర్కొన్నారు. విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, పై తెలిపిన సర్వేనంబర్లలో సర్వేచేయించి ప్రభుత్వ స్థలాలకు భద్రత కల్పించాలని కోరారు. స్పందన కార్యక్రమంలో 13 మంది అర్జీలను ఆర్డీఓ మనోజ్‌కుమార్‌కు అందజేశారు. ఇందులో మండలాల వారీగా గంగవరం 4, వి.కోట మండలం 1, సోమల 2, సదుం, 6, బంగారుపాళ్యం 1 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు.

మైనారిటీల సంక్షేమమే వైసీపీ ధ్యేయం

కుప్పం, మార్చి 11: మైనారిటీల సంక్షేమం, అభివృద్ధే వైసీపీ ధ్యేయమని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. కుప్పంలో సోమవారం అధికార పార్టీ ఆధ్వర్యంలో మైనారిటీలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు వేసే ప్రతిఓటూ జగన్‌కు వేసినట్లేనని, ఆయన మళ్లీ ముఖ్యమంత్రి అయితే మైనారిటీల బతుకులు బాగుపడుతాయని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్, ఏఎంసీ ఛైర్మన్ విద్యాసాగర్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ హఫీజ్ పాల్గొన్నారు.

జగన్‌ది వాపేగాని బలం కాదు : అమర్



మాట్లాడుతున్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి

పలమనేరు, మార్చి11 : జగన్‌ది వాపేగాని బలం కాదని ఇంతవరకు జరిగిన సిద్ధం సభలతో తేలిపోయిందని మాజీ మంత్రి అమరనాథరెడ్డి అన్నారు. జగన్‌కు ప్రజాబలం వుంటే ప్రతిపక్షాల ఐక్యతను చూసి భయం ఎందుకో అని ప్రశ్నించారు. సోమవారం పలమనేరు టీడీపీ కార్యాలయంలో ముఖ్యనేతల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రజలను మాయ చేయడానికి మేదరమెట్లలో సిద్ధం సభకు రూ.100కోట్లు ఖర్చుచేసి జనాన్ని తరలించే ప్రయత్నం చేశారన్నారు. అయినా సభ వెలవెలబోయిందని, మీడియాపై ఆంక్షలు పెట్టి గ్రాఫిక్స్‌తో తనకు ప్రజాబలం ఉన్నట్లు సొంత డబ్బా కొట్టుకొంటున్నారన్నారు. జగన్ పాలనలో అన్ని వర్గాలు నష్టపోయాయని అన్నారు. ప్రతిపక్షాల ఐక్యతతో జగన్ ఎన్నికల అక్రమాలు ఏమాత్రం సాగవని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన ఎంపీ అభ్యర్థి

పలమనేరు, మార్చి11 : చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి ప్రసాదరావు సోమవారం మాజీ మంత్రి అమరనాథరెడ్డిని తన అనుచరులతో వచ్చి కలిశారు. అమరనాథరెడ్డిని ప్రసాదరావు శాలువకప్పి సన్మానించారు. ప్రసాదరావును పలమనేరు టీడీపీ నాయకులకు అమరనాథ రెడ్డి పరిచయం చేశారు. పార్టీ ఆదేశాల మేరకు ఎంపీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవడానికి కృషిచేయాలని నాయకులకు పిలుపునిచ్చారు.

వన్నెకుల క్షత్రియుల ఆత్మీయ సమావేశం

గుడుపల్లె, మార్చి 11: రాళ్లగంగమాంబ దేవాలయం ఆవరణలో సోమవారం వన్నెకుల క్షత్రియుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ కుప్పానికి హంద్రీ-నీవా జలాలు తెచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేన్నారు. వన్నెకుల క్షత్రియుల కోసం కల్యాణ మండపం పూర్తి చేసింది ఈ ప్రభుత్వ హయంలోనే అన్నారు. కార్యక్రమంలో వన్నెకుల క్షత్రీయ కార్పొరేషన్ చేర్మేన్ వనితా శ్రీను, ఎంపీపీ వరలక్ష్మీ, జడ్పీటీసీలు సరవణ, క్రిష్ణమూర్తి, కన్వీనర్ మురుగేష్, ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గా, వెంకటస్వామి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్నతోనే రైతు రాజ్యం సాధ్యం

శాంతిపురం, మార్చి 11: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రంలో రైతు రాజ్యం సాధ్యపడుతుందని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, పార్టీ మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు తెలిపారు. సోమవారం వారు కొలమడుగు పంచాయతీలో చంద్రబాబు తరపున ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ళ అసమర్థ పాలనలో ప్రజలు, రైతులు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని కష్ట, నష్టాలను చవిచూడాల్సి వచ్చిందన్నారు. చంద్రబాబు తిరిగి సీఎం కావడం తథ్యమని, ఆయన అన్ని వర్గాల అభ్యున్నతికి బాటలు వేస్తారన్నారు. దీనిని గుర్తించి ప్రతి ఒక్క ఓటరూ వచ్చే ఎన్నికల్లో టీడీపీని ఆదరించి, చంద్రబాబును అపూర్వ మెజారిటీతో గెలిపించాలని వారు కోరారు. కార్యక్రమంలో నేతలు విజయరామిరెడ్డి, నారాయణరెడ్డి, జయరామిరెడ్డి, శ్యామల, పౌలారాణి, రూప పాల్గొన్నారు.

రేపు గుడుపల్లె మండల సమావేశం

గుడుపల్లె, మార్చి 11: గుడుపల్లె మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు స్త్రీశక్తి భవనంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎన్ గోపి తెలిపారు. అన్ని శాఖల అధికారులు, కోఆప్షన్ సభ్యులు, సర్పంచులు, ఎంపీటీసీలు తప్పక హాజరు కావాలని తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

కలెక్టర్ షన్మోహన్



అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

కుప్పం, మార్చి 11: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్, ఎన్నికల అధికారి అయిన సగిలి షన్మోహన్ అన్నారు. కుప్పంలో ఆయన సోమవారం ఎన్నికల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నిబంధనలు ఉల్లంఘించకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సక్రమ నిర్వహణ కోసం ఫిర్యాదుల విభాగం, 1950 కాల్ సెంటర్, ఎన్‌జీఎస్‌పీ యూనిట్, ఎంసీసీ మానిటరింగ్ రిక్వెస్ట్ అండ్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ రిపోర్ట్స్ హ్యూమన్ రిసోర్సెస్, మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ తదితర విభాగాలను ఇప్పటికే ఏర్పాటు చేశామన్నారు. నగదు, మద్యం పంపిణీ వంటి ఓటర్లను ప్రలోభపెట్టే కార్యకలాపాలపై ఫ్లయింగ్ స్క్వాడ్ నిఘావేసి వీడియోలు తీసి, సంబంధిత వ్యక్తులకు, పార్టీలకు నోటీసులు పంపించాలని ఆదేశించారు. అనంతరం కుప్పం పట్టణంలోని ప్రభుత్వ వృత్తివిద్యా జూనియర్ కళాశాలను సందర్శించారు. ఇక్కడ ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్స్, రిసెప్షన్ ఎంటర్ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించారు. జేసీ పి.శ్రీనివాసులు, ఆర్డీవో జి.శ్రీనివాసులు, డీఎస్పీ శ్రీనాథ్‌తో పాటు డివిజన్ అధికారులు పలువురు కలెక్టర్ పర్యటనలో పాల్గొన్నారు.

మొదటి ర్యాంకు విద్యార్థికి కలెక్టర్ అభినందన



కుప్పం, మార్చి 11: కుప్పంలోని ప్రభుత్వ వృత్తివిద్యా జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం లో మొదటి ర్యాంకు సాధించిన ధనుశ్రీని సోమవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ అభినందించారు. ఏవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటుకోసం ఈ కళాశాలను పరిశీలించిన ఆయన 2023 విద్యాసంవత్సరంలో 500 మార్కులకు గాను 494 మార్కులు సాధించిన ధనుశ్రీని అభినందించి, ఇలాగే చదివి ఉన్నత స్థాయి చేరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతీశ్వర్, సీనియర్ అధ్యాపకులు జగదీశ్‌బాబు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల డ్యూటీ ఎప్పుడూ కొత్తగానే ఉంటుంది : కలెక్టరు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షన్మోహన్

పలమనేరు, మార్చి11 : ఎన్నికల విధులను గతంలో ఎన్నిసార్లు నిర్వహించినా మళ్లీ ఎన్నికల వేళ కొత్తగా ఉంటుందని కలెక్టర్ షన్మోహన్ పేర్కొన్నారు. సోమవారం పలమనేరు ఆర్డీవో కార్యాలయంలో జేసీ శ్రీనివాసులు, ఆర్డీఓ మనోజ్‌కుమార్‌రెడ్డి, డీఎస్పీ మహేశ్వరరెడ్డి, శిక్షణ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్నతో కలిసి సార్వత్రిక ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకుని ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఎన్నికలు నిర్వహించాలన్నారు. కంట్రోలు రూం నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించి రిపోర్టును ఆర్ఓ ద్వారా జిల్లా ఎన్నికల అధికారికి పంపించాలన్నారు. రాజకీయ పార్టీ సభలు, సమావేశాలకు ముందుగా డీఎస్పీ అనుమతి తీసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎస్ఓలు, ఎంసీసీ, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ, వీవీటీ, అకౌంట్స్ టీం అధికారులు పాల్గొన్నారు. అనంతరం పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈవీఎంలు భద్రపరచడానికి స్ట్రాంగ్‌రూంలు, రిసెప్షన్ సెంటర్లను పరిశీలించారు.

రావణ వాహనంపై అగస్త్యేశ్వరుడి ఊరేగింపు





ప్రత్యేక అలంకరణలో అగస్త్యేశ్వరస్వామి, రావణ వాహనోత్సవంలో పార్వతి సమేత అగస్త్యేశ్వరస్వామి

పుంగనూరు రూరల్, మార్చి 11: పుంగనూరు మండలం నెక్కుంది సమీపంలో వెలసిన అగస్త్యేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం ఆలయం చుట్టూ రావణ వాహనంపై స్వామి వారు విహరించారు. అర్చకులు ఉదయాన్నే అగస్త్యేశ్వరస్వామి, ప్రసన్నపార్వతీదేవిలను అలంకరించి రావణ వాహనంపై ఏర్పాటు చేయగా భక్తుల శివనామస్మరణ మధ్య ఊరేగింపు జరిగింది. దీపోత్సవం సందర్భంగా భక్తులు సందడి నెలకొంది. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం, పానకం పంపిణీ చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా బారికేట్లు ఏర్పాటుచేసి, ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పాట్లను పుంగనూరు సీఐ రాఘవరెడ్డి, స్టేషన్ సిబ్బంది పర్యవేక్షించారు. పుంగనూరు ఆర్టీసీ డిపో మేనేజర్ సుధాకరయ్య భక్తుల సౌకర్యార్థం పుంగనూరు నుంచి అగస్త్యేశ్వరస్వామి కొండ, చౌడేపల్లె, రాయలపేట నుంచి ఆర్టీసీ సర్వీసులను ఏర్పాటు చేశారు.

జగన్ కామెడీ షోతో రాష్ట్రం మొత్తం నవ్వుకుంది : కంచర్ల



రైతు చైతన్య యాత్ర సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల

రామకుప్పం, మార్చి 11: కుప్పానికి హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణాజలాలు ఇస్తున్నామంటూ గత నెల 26న రామకుప్పం మండలం రాజుపేట వద్ద సీఎం జగన్ చేసిన జబర్దస్థ్ కామెడీ షోతో రాష్ట్రం యావత్తు నవ్వుకుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చంద్రబాబు పీఏ మనోహర్ తెలిపారు. సోమవారం రామకుప్పం మండలం 89పెద్దూరులో తెలుగు రైతు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన చంద్రన్న రైతు చైతన్య యాత్ర సభలో వారు మాట్లాడుతూ సీఎం జగన్ రామకుప్పంలో గేట్ ఎత్తి కృష్ణా జలాలు విడుదల చేసిన 11రోజులకే కాలువ ఎండిపోయిందన్నారు. రాష్ట్రంతోపాటు, కుప్పం నియోజకవర్గంలో రైతుల సంక్షేమం కోసం కృషి చేసింది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం 89పెద్దూరులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు మద్దతుగా ఆయన ఇంటింటా ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాలకులు కుప్పంపై కక్షగట్టి అభివృద్ధిని ఆపేశారన్నారు. మరోవైపు ఆంక్షలతో సంక్షేమ పథకాల ఫలాలు అందరికీ అందడం లేదన్నారు. రాష్ట్రంలో ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారని గుర్తించి చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాలతో వారిలో భరోసా నింపారన్నారు. ఓడిపోయే వైసీపీ అభ్యర్థికి ఓటు వేసి వృథా చేసుకోరాదని ఆయన కోరారు. ఇదిలా వుండగా 89పెద్దూరుకు చెందిన వైసీపీ నేత టమోటా శీనప్ప టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

ఎన్నికలకోసమే మంత్రి 'అభివృద్ధి' షో

కుప్పం, : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల పేరుతో కుప్పంలో జరిపిన పర్యటన షో మాత్రమేనని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ విమర్శించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ కుప్పం మున్సిపల్ భవన నిర్మాణ పనులు కేవలం బయట మాత్రమే పూర్తి చేసి, ప్రారంభోత్సవం నాటకం ఆడారని ఎద్దేవా చేశారు. కుప్పం మున్సిపాలిటీలో ప్రభుత్వం రూ.66 కోట్లతో చేసిన అభివృద్ధి పనులేవో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రారంభోత్సవాలు చేయడానికి మంత్రి మనవడికి ఉన్న ప్రోటోకాల్ ఏమిటని నిలదీశారు. కార్యక్రమంలో టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు గోపీనాథ్, శాంతారాం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి 30 మంది యువకులు

కుప్పంలో వైసీపీనుంచి సుమారు 30 మంది యువకులు సోమవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. క్లస్టర్ ఇన్‌ఛార్జి వీజీ.ప్రతాప్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునియప్ప ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్‌లు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడిగా ప్రశాంత్‌ను, ద్రావిడ విశ్వవిద్యాలయం టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ధనుష్, పి.హరీష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పుంగనూరు గంగజాతరకు ప్రత్యేక ఏర్పాట్లు

పుంగనూరు, మార్చి11: పుంగనూరులో ఏప్రిల్ 2, 3 తేదీల్లో సుగుటూరు గంగమ్మ జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు మున్సిపల్ ఛైర్మన్ ఎస్.అలీంబాషా తెలిపారు. సోమవారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర మీట్ జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్లు పూలత్యాగరాజు, అమ్ములు గంగజాతర, రంజాన్ పండుగల సందర్భంగా ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మంగళవారం నుంచి పట్టణంలోని 22 మసీదుల్లో తాగునీరు, లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. కౌన్సిలర్ పూల త్యాగరాజు మాట్లాడుతూ గంగజాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారని, తాగునీటి వసతులు, ఆరోగ్య, పారిశుధ్యం లోపం రాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సివుందన్నారు. గంగజాతరలో ప్రజాప్రతినిధులకు ప్రత్యేక దర్శనాలు కల్పించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల మేరకు పని చేయాల్సివుంటుందని, ప్రజా ప్రతినిధులు సహకరించాలని కోరారు. కౌన్సిలర్ అమ్ము మాట్లాడుతూ అజెండాలోని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ రసూల్‌ఖాన్, ఇతర శాఖల అధికారులు, వైస్ ఛైర్మన్లు నాగేంద్ర, లలిత, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించే వరకు నిరసన ఆగదు

గుడుపల్లె, మార్చి 11: అధికారులు తమ సమస్యలు పరిష్కరించేవరకు నిరసన ఆగదని ద్రావిడ విశ్వవిద్యాలయం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పేర్కొన్నారు. సోమవారం ద్రావిడ వర్సిటీ పరిపాలన భవనం ఎదుట ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమకు జీతాలు అందించాలని కోరుతూ నిరసన వ్యక్తంచేశారు. వారు మాట్లాడుతూ ఐదునెలలు జీతాలు అందక తాము అనేక సమస్యలు పడుతున్నామన్నారు. ఇకనైన తమ డిమాండ్‌లను నెరవేర్చాలని కోరారు.

టీడీపీ నేతల ఇంటింటా ప్రచారం

రామకుప్పం, మార్చి 11: రామకుప్పం పట్టణం, బగళనత్తం, ఉస్సిగానిపల్లె గ్రామాల్లో సోమవారం పార్టీ అధినేత చంద్రబాబు తరపున ఇంటింటా టీడీపీ నేతలు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీకి ఘనవిజయం అందించాలని వారు కోరారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ అంజినేయరెడ్డి, నాయకులు రామ్మూర్తి, శ్రీనాథరెడ్డి, సలాంసాబ్, ఆదిల్, చాన్‌బాషా, విజయ్‌కుమార్‌రెడ్డి, టీపీరవి, బాలరాజు, సుబ్రీ, అవినాశ్, అమర్, శంకర్, శ్రీకాంత్, బొరుగులశీన తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

చౌడేపల్లె, మార్చి11: రాష్ట్ర సీపీఎస్ గౌరవ అధ్యక్షుడు రేగంటి దేవానంద్, ఆయన సోదరుడు రవికుమార్ సోమవారం పదోతరగతి విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఆమినిగుంటకు చెందిన వారి తండ్రి విశ్రాంత ఎస్ఐ రేగంటి నరసింహులు జ్ఞాపకార్థం పరికిదొన హైస్కూల్లోని పదోతరగతి విద్యార్థులకు ప్యాడ్, జామింట్రీ బాక్స్, పెన్నులు, పెన్సిల్‌లు బుక్స్, 8,9 తరగతి విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు యోగనిఖిల్‌నంద్, హెచ్‌ఎం రవీంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం



చౌడేపల్లె, మార్చి11: స్థానిక ఎంఆర్సీ వద్ద సోమవారం మహిళా దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఈవో -2 తిరుమలమ్మను, మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మామిడి తోటలోని గుడిసెకు నిప్పు



దగ్ధమైన ఎక్స్‌ఎల్ వాహనం

సోమల, మార్చి 11: సోమల మండలం నడింపల్లెకు చెందిన మల్లికార్జున మామిడి తోట లోని గుడిసెకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో గుడిసెలోని టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనం, టమోటా డ్రిప్‌పైపులు, యూరియా బస్తాలు, పీవీసీ పైపులు అగ్నికి ఆహుతయ్యాయి. అలాగే మంటలు వ్యాప్తి చెంది పలు మామిడి చెట్లు కాలిపోయాయి. సోమవారం బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పలమనేరు బార్ అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవం



లక్ష్మీపతి, బర్కత్‌బీ

పలమనేరు, మార్చి 11 : పలమనేరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.లక్ష్మీపతి, ప్రధానకార్యదర్శిగా ఎస్.బర్కత్‌బీ, ఉపాధ్యక్షులుగా వి.చంద్రశేఖర్, పి.పరమశివప్ప, సహకార్యదర్శిగా సంజయ్, లైబ్రరీ సెక్రటరీగా కె.జగదీష్‌కుమార్, కోశాధికారిగా గుణశేఖర్, స్పోర్ట్సు అండ్ కల్చరల్ సెక్రటరీగా ఎస్. రంజిత్ షా, మహిళా ప్రతినిధిగా ఐ.బి.శ్రీనిజను ఎన్నుకున్నారు.

గంగమ్మ గుడిలో అమావాస్య పూజలు



రామకుప్పం, మార్చి 11: పట్టణంలోని దిగువవీధి గంగమ్మ ఆలయంలో ఆదివారం రాత్రి అమావాస్య పూజలు వైభవంగా జరిగాయి. రాత్రి అమ్మవారితోపాటు రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామివార్లకు ప్రత్యేక అభిషేకపూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూరహారతులిచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

పౌష్టికాహార పక్షోత్సవాల ర్యాలీ

పలమనేరు, మార్చి11 : పలమనేరులో సోమవారం సీడీపీవో ఇందిరాప్రియదర్శిని ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈనెల 9 నుంచి 23వ తేది వరకు పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్లు కూడా గ్రామాల్లో మహిళలకు, బాలింతలకు, గర్భిణులకు ప్రభుత్వం అందజేస్తున్న వివిధరకాల పౌష్టికాహారాన్ని, మిలెట్ల ప్రాధాన్యతను వివరించాలని సూచించారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

బైరెడ్డిపల్లె, మార్చి 11 : బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు సహకారంతో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. వైద్యాధికారి డాక్టర్ విజయచందర్ మాట్లాడుతూ గర్భిణులు ప్రతినెలా వైద్యపరీక్షలు చేయించుకుని పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమని, వ్యక్తిగతశుభ్రత, తల్లిపాల ప్రాముఖ్యత, కుటుంబ నియంత్రణ గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ శాలిని, సీహెచ్‌వో అనురాధ, ఆరోగ్య విద్యాధికారి సావిత్రి, మహతి ఫౌండేషన్ ప్రతినిధులు శాంతమ్మ, శ్రీనివాసులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ

బైరెడ్డిపల్లె, మార్చి 11 : మండలంలోని శెట్టిపల్లెలో అర్హులైన వారికి సోమవారం ఎంపీపీ రెడ్డెప్ప ఇళ్లపట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణారెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

సోమల,మార్చి11: గర్భిణులు ప్రభుత్వ వైద్యశాలల్లో చికిత్సలు పొందాలని పెద్దఉప్పరపల్లె వైద్యాధికారి డాక్టర్ బాలాజీ అన్నారు. సోమవారం స్థానిక వైద్యశాలలో గర్భిణులకు పలు రకాల వైద్య పరీక్షలు జరిపి మందులు అందజేశారు. అలాగే వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఓఆర్ఎస్ ద్రావకం వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆంజనేయులు, అంజమ్మ, స్వర్ణ, హేమ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివభక్తుల ఇరుముడులు



సోమల, మార్చి 11: ఇరికిపెంట సమీప మధురమలై కొండలో కొలువుతీరిన మల్లేశ్వర స్వామి ఆలయంలో శివభక్తులు భక్తిశ్రద్ధలతో ఇరుముడులు చెల్లించుకున్నారు. గత 40 రోజులుగా శివమాలాధరణ చేసిన భక్తులు దీక్షలో ఉన్నారు. శివమాల భక్తులు శివనామస్మరణలతో కొండను అధిరోహించి ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు జరిపారు. భక్తులకు పోలూరు శ్రీనివాసులు అన్నదాన, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

రామకుప్పం, మార్చి 11: పట్టణంలోని పోలీస్‌స్టేషన్ సర్కిల్‌లో మంగళవారం అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జరుగుతుందని ఎమ్మెల్సీ భరత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ పాల్గొంటారని తెలిపారు.

రేపటి నుంచి డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

పుంగనూరు రూరల్, మార్చి11: ఈనెల 13 నుంచి డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపోమేనేజర్ సుధాకరయ్య తెలిపారు. ఉదయం 11 నుంచి 12గంటల మధ్య ప్రయాణికులు 9100941850 నంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలతోపాటు సూచనలు, సలహాలు ఇవ్వాలని ఆయన కోరారు.

కిలో టమోటా రూ.20

పుంగనూరు, మార్చి 11: పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం కిలో టమోటా ధర రూ.20 పలికింది. ఇటీవల కిలో ధర రూ. 10 నుంచి రూ.18 వరకు ఉండగా శుక్రవారం కిలో ధర రూ.11.40, శనివారం రూ.12 ఉండగా ఆది, సోమవారాల్లో మాత్రం మొదటి రకం కిలో రూ.20, రెండోరకం రూ.16, మూడో రకం రూ.12 చొప్పున యార్డులో రైతుల నుంచి వ్యాపారస్తులు టమోటా కొనుగోలు చేసి తమిళనాడు, ఇతర ప్రాంతాలకు 15.72 మెట్రిక్ టన్నులను ఎగుమతి చేశారు.

బాగేపల్లెలో గడ్డివామి దగ్ధం



పుంగనూరు రూరల్, మార్చి 11: పుంగనూరు సమీపంలోని బాగేపల్లెకు చెందిన వెంకటముని నిల్వ వుంచిన గడ్డివామి సోమవారం దగ్ధమైంది. మంటలు చెలరేగడాన్ని గుర్తించిన స్థానికులు పుంగనూరు అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం ఇవ్వడంతో ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు, వారి సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేశారు. అప్పటికే సుమారు రూ. 50వేలు విలువ చేసే గడ్డి, కొయ్యలు కాలిపోయినట్లు బాధితుడు తెలిపారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

టీడీపీ, జనసేన ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి



గుండ్రాజకుప్పం దళితవాడలో భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నగరి, మార్చి 11: టీడీపీ, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే అన్నివర్గాల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం నగరి మండలం గుండ్రాజుకుప్పం దళితవాడలో ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంచుతూ, సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను తెప్పించి రాష్ట్రంలోని అన్ని దళితవాడలను అభివృద్ధి చేయనున్నట్లు ఆయన చెప్పారు. నగరి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నగరి మండల టీడీపీ అధ్యక్షులు శివకుమార్‌రెడ్డి, కార్యదర్శి పురుషోత్తం నాయుడు, నేతలు చినబాబు, మీరా, బాలాజీ, జనసేన నాయకులు మెరుపుల మహేష్, నారాయణస్వామి నాయుడు, సర్పంచ్ జయపాల్, అలెక్స్ రాజన్, రవి, చిన్నదొరై, ఆనంద్ నవీన్, బాబు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిపక్షపార్టీలంటే జగన్‌కు భయం: గురజాల

చిత్తూరు సిటీ, మార్చి 11: ప్రతిపక్ష పార్టీలంటే సీఎం జగన్‌కు భయమని చిత్తూరు నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేదరమెట్లలో సిద్ధం సభకు సుమారు రూ.100 కోట్లు ఖర్చు చేసి జనాన్ని తరలించే ప్రయత్నం చేశారని, అయినా సభ వెలవెలబోయిందని ఎద్దేవా చేశారు. మీడియాపై అంక్షలు పెట్టి గ్రాఫిక్స్ మాయాజాలంతో తనకు ప్రజాబలం ఉన్నట్లు సొంత డప్పుకొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. సీఎం జగన్ ఉద్యోగాల భర్తీ, మద్యనిషేధం, సీపీఎస్ రద్దు, విద్యుత్ ఛార్జీల తగ్గింపు, ఉచిత ఇసుక సరఫరా ఇలా అన్ని విషయాల్లోనూ మాటతప్పి మడమ తిప్పారని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో జగన్‌ను చిత్తుగా ఓడించి టీడీపీ అధినేత చంద్రబాబును సీఎం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు టీడీపీ, బీజేపీ, జనసేన బహిరంగ సభ

టీడీపీ, బీజేపీ, జనసేన బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీల ఉమ్మడి అభ్యర్థి గురజాల జగన్మోహన్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు నగరంలోని పీవీకేఎన్ కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సభకు టీడీపీ, బీజేపీ, జనసేన ముఖ్య నేతలు హాజరవుతారని, కార్యకర్తలు, అభిమానులు భారీగా హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అవమానాలు, బాధలు తట్టుకుంటేనే రాజకీయాల్లో నిలబడగలం

● చేయూత సభలో కన్నీళ్లు పెట్టుకున్న డిప్యూటీ సీఎం, కుమార్తె

గంగాధరనెల్లూరు, మార్చి 11: "ఎన్నో అవమానాలు, ఎన్నో బాధలు తట్టుకుంటునే రాజకీయాల్లో నిలబడగలం" అంటూ డిప్యూటీ సీఎం నారాయణస్వామి వ్యాఖ్యానించారు. గంగాధరనెల్లూరు ఎంపీడీవో ఆఫీస్ ఆవరణలో సోమవారం వైఎస్సార్ చేయూత కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ తన కుమార్తె కృపాలక్ష్మి గురించి మాట్లాడుతున్నపుడు ఆమె కన్నీటిమయం అయ్యారు. ఆమెను చూసి ఆయన కూడా కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇదిలా ఉండగా ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన డిప్యూటీ సీఎంకు కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. ఐకేపీ, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది మైకుల్లో డ్వాక్రా గ్రూపు మహిళలకు ఫోన్‌లు చేసి త్వరగా రప్పించాలని పలుసార్లు చెప్పడంతో గంట తర్వాత మహిళలు కొందరు సభకు వచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ అబ్బూ అనిత, సీడీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ వేల్కూరు బాబురెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, గుణారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ చిన్నమరెడ్డి పాల్గొన్నారు.

సభకి వస్తేనే ఆసరా డబ్బులిస్తాం

పాలసముద్రం, మార్చి 11: ప్రతి మహిళా సమావేశానికి వచ్చి సంతకం చేస్తేనే వైఎస్సార్ ఆసరా డబ్బులిస్తామంటూ పాలసముద్రం అధికారులు బెదిరించి మరీ మహిళల్ని సోమవారం జరిగిన వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమానికి తరలించారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి 1407 మంది మహిళలకు రూ.2.64కోట్లు మెగా చెక్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అన్బు, మండల వైసీపీ కన్వీనర్ తులసీరామ్, నాయకులు సుమన్, పోలయ్య పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం

శ్రీరంగరాజపురం, మార్చి 11: మండలంలోని తయ్యూరులో సచివాలయం, మినరల్ వాటర్ ప్లాంట్‌ను డిప్యూటీ సీఎం నారాయణస్వామి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త కృపాలక్ష్మితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, జడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ సరిత, మాజీ జడ్పీటీసీ గురవారెడ్డి, సర్పంచ్‌లు వరదమ్మ, మార్కొండయ్య, నాయకులు మణి, కుప్పయ్య, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీల్లో ఏపీటీడబ్ల్యుఆర్ఎస్ విద్యార్థినుల ప్రతిభ



చిత్తూరు (సెంట్రల్), మార్చి 11: గుంటూరు కేఎల్ డీమ్డ్ వర్సిటీ నిర్వహించి 11వ జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీల్లో చిత్తూరు ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థినులు సత్తా చాటి 11 బంగారు, 6 రజిత పతకాలు సాధించారు. బంగారు పతకాలు సాధించిన వారిలో గంగోత్రి, హేమలత, మధు (9వ తరగతి), వరలక్ష్మి (8వ తరగతి), హారిక, నాగమ్మ, నాగవల్లి (7వ తరగతి) విద్యార్థినులు ఉన్నారు. రజితం పొందిన వారిలో స్వప్న (9వ తరగతి), షారుక, భాను (8వ తరగతి), హేమలత, మోక్షిత (7వ తరగతి), జాహ్నవి (6వ తరగతి) విద్యార్థినులు ఉన్నారు. ఉపాధ్యాయిని కె.రేవతికి ఉత్తమ చిత్రలేఖన ఆచార్య పురస్కార్ అవార్డు లభించింది. వీరిని పాఠశాల ప్రిన్సిపాల్ రేఖ, అధ్యాపకులు, విద్యార్థినులు అభినందించారు.

నిబంధనల ప్రకారమే ఓటరు దరఖాస్తుల పరిష్కారం

చిత్తూరు, మార్చి 11: ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఓటరు దరఖాస్తులను పరిష్కరించాలని ఆర్డీవో చిన్నయ్య, ఏఈఆర్వో అరుణ చెప్పారు. ఓటరు దరఖాస్తుల పరిశీలన, పరిష్కారం అనే అంశాలపై బీఎల్‌వోలతో సోమవారం నగరపాలక కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఫారం 6, 7, 8ఎ దరఖాస్తులను సత్వరం పూర్తి చేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎంఎం గోపి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సెమినార్‌లో జిల్లా వాసులు



చిత్తూరు (సెంట్రల్), మార్చి 11: జాతీయ స్థాయిలో సోమవారం న్యూఢిల్లీలో మిషన్ 2030- ఇండియా ఏ గ్లోబల్ లీడర్ ఫర్ వ్యాల్యూ యాడెడ్ ఫుడ్ అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో జిల్లాకు చెందిన కట్టమంచి బాబి, బాబురెడ్డిలు పాల్గొని ప్రసంగించారు. 2030లోపు భారతదేశం ప్రపంచంలోనే ఆహార శుద్ధి పరిశ్రమల ఎగుమతిలో ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలుస్తుందని వివరించారు. దాదాపు 300 మంది ఆహార శుద్ధి పరిశ్రమల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

ఎంపీడీవో వెంకటేశు బాధ్యతల స్వీకరణ

ఐరాల, మార్చి 11: ఐరాల మండల ప్రజలందరికి అందుబాటులో ఉండి సేవ చేస్తానని నూతన ఎంపీడీవోగా విచ్చేసిన వెంకటేశు తెలిపారు. సోమవారం ఆయన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయన్ను కార్యాలయ సిబ్బంది సన్మానించారు. ఆయన చౌడేపల్లె మండలం ఎంపీడీవోగా పని చేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వహించిన కుసుమకుమారి ఇక్కడే ఈవోపీఆర్డీగా బాధ్యతలు చేపట్టారు.

కేంద్ర బలగాల కవాతు



బంగారుపాళ్యంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

బంగారుపాళ్యం, మార్చి 11: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడంతో పాటు ప్రజల్లో నమ్మకం నింపడానికి సోమవారం కేంద్ర బలగాలు మండల కేంద్రంలో కవాతు నిర్వహించాయి. ఎన్నికల ప్రక్రియలో అసాంఘిక శక్తులు చొరబడే ప్రమాదం ఉన్నందున వారికి ముందుగానే హెచ్చరికలు జారీచేయడానికి ఈ కవాతు నిర్వహిస్తున్నట్లు సీఐ లక్ష్మయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మల్లికార్జున, కేంద్ర బలగాలు, పోలీసులు పాల్గొన్నారు.

పూతలపట్టులో...

పూతలపట్టు, మార్చి 11: మండలంలోని గొడుగుచింత, పి. కొత్తకోట, బండపల్లె, పూతలపట్టు, వావిల్‌తోట గ్రామాల్లో సోమవారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమ ఓటును నిర్భయంగా వేసుకునేందుకు కవాతును నిర్వహించామని సీఐ సుదర్శన్ తెలిపారు.

కార్వేటినగరంలో...

కార్వేటినగరం, మార్చి 11: రానున్న ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా కార్వేటినగరం వీధుల్లో సోమవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఎస్ఎస్‌బీ కమాండర్ దీపాంకర్ బర్మా, ట్రైనీ డీఎస్పీ ప్రవీణ్‌కుమార్, నగరి డీఎస్పీ మూర్తి, కార్వేటినగరం సీఐ సత్యబాబు, ఎస్ఐ వెంకటకృష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ చేయూత చెక్కు పంపిణీ

గుడిపాల, మార్చి 11: వైఎస్సార్ చేయూత చెక్కును చిత్తూరు వైసీపీ సమన్వయకర్త విజయానంద రెడ్డి, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ రమ్య మహిళలకు అందజేశారు. సోమవారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా బహిరంగ సభ నిర్వహించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు జనార్దన్, మధుసూదన్ రెడ్డి, కార్మేఘున్, మధుసూదన్ రాయల్, చిట్టిబాబు, గోళ్ళ హరిప్రసాద్ చౌదరి, శ్రీకర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, రాజ, ప్రకాష్, సాయి, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూతలపట్టులో....

పూతలపట్టు, మార్చి 11: ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ చేయూత కార్యక్రమం జరిగింది. పలువురు మహిళల ఖాతాల్లో రూ.4.04 కోట్లను జమచేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌కుమార్, ఎంపీపీ కుమారి, జడ్పీటీసీ దేవిక, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రాజారత్నంరెడ్డి, పోలవరం సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐరాలలో...

ఐరాల, మార్చి 11: ఐరాల మండలంలోని డ్వాక్రా సంఘాల మహిళలకు సోమవారం చేయూత చెక్కులను పూతలపట్టు వైసీపీ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ పంపిణీ చేశారు. మండలంలోని 2705 డ్వాక్రా సంఘాలకు రూ.5,07,18,750 చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోహన్, జడ్పీటీసీ సుచిత్ర, వైసీపీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రాజేష్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీవో కార్యాలయం ప్రారంభం

నగరి, మార్చి 11: నగరి పట్టణ పరిధిలోని రాజీవ్‌నగర్ సమీపంలో గల ఎస్ఎన్ఎన్ కాంపౌండ్‌లో సోమవారం మంత్రి రోజా ఆర్టీవో కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరెడ్డి, ఆర్టీవో కార్యాలయ సిబ్బంది, స్థానిక వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో పాము



చిత్తూరు సిటీ, మార్చి 11: జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో సోమవారం నాగుపాము హల్‌చల్ చేసింది. వెంటనే అధికారులు స్నేక్ క్యాచర్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన పామును పట్టి అటవీ ప్రాంతంలో వదిలిపెట్టారు. దీంతో కార్యాలయ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. కాగా కార్యాలయం చుట్టూ పిచ్చిమొక్కలు, పుట్టలు ఎక్కువగా ఉండటంతో తరచూ పాములు ఇలా కార్యాలయంలోకి వస్తుంటాయని సిబ్బంది చెప్పారు.

వెటర్నరీ డాక్టర్‌కు సన్మానం



యాదమరి, మార్చి 11: మండల కేంద్రమైన యాదమరి పశు వైద్యాధికారిగా పనిచేస్తూ బదిలీపై వెళ్లిన అమరనాథరెడ్డిని సిబ్బంది, రైతులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఆ శాఖ జేడీ ప్రభాకర్ హాజరై అమరనాథరెడ్డి రైతులకు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం ఆయనకు శాలువాకప్పి సన్మానించారు. రైతులు నోమేష్, ధనయ్య తదితరులు డాక్టర్‌కు పుష్పగుచ్ఛాలందించి సత్కరించారు.

డీసీఓగా బాధ్యతలు చేపట్టిన నాగవర్ధన



నాగవర్ధనకు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

చిత్తూరు (సెంట్రల్), మార్చి 11: జిల్లా సహకార శాఖ అధికారిణిగా నాగవర్ధన సోమవారం కలెక్టరేట్‌లోని డీసీవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇన్‌చార్జి డీసీవో బ్రహ్మానందరెడ్డి ఆమెకు బాధ్యతలు అప్పగించారు. డీఎల్‌పీవో వనజ, డీసీసీబీ అధికారిణి నారాయణమ్మ, డీసీఓడీఎల్‌సీఓ కార్యాలయం సిబ్బంది డీసీవోను మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ కార్యకర్త మృతికి ఘన నివాళి

కార్వేటినగరం, మార్చి 11: మండలంలోని రాజులకండ్రిగకు చెందిన టీడీపీ కార్యకర్త సుబ్రమణ్యం యాదవ్ అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. మండల టీడీపీ నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మండల టీడీపీ అధ్యక్షులు రాయల్ యాదవ్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు రవియాదవ్, టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు కుమారస్వామి రాజు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడానికే అన్నక్యాంటీన్

గుడిపాల, మార్చి 11: పేదల ఆకలి తీర్చడానికే అన్నక్యాంటీన్‌ను నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ సీనియర్ నాయకులు జయదేవ నాయుడు, గోవింద గౌడ్ అన్నారు. సోమవారం మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వైభవంగా ముగిసిన శివరాత్రి ఉత్సవాలు



కట్టమంచి విశ్వశాంతి భవనంలో ఏర్పాటు చేసిన శివలింగ ప్రదర్శన

చిత్తూరు కల్చరల్, మార్చి 11: నగరంలోని కట్టమంచి సన్నిధి వీధి విశ్వశాంతి భవనంలో గత మూడు రోజులుగా ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా శివరాత్రి ఉత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ముగిశాయి. విశ్వశాంతి బ్రహ్మకుమారీస్ నిర్వాహకురాలు బి.కె. కళ్యాణి ఆధ్వర్యంలో ప్రతి రోజు స్థానిక పురవీధుల్లో శివలింగ ప్రతిమలతో శివనామ స్మరణ చేస్తూ ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వం తరఫున సాంబయ్యకండ్రిగ కార్పొరేటర్ హరిణి రెడ్డి, చుడా ఛైర్మన్ సి. పురుషోత్తం రెడ్డిలు మేళతాళాలతో ప్రదర్శనగా వచ్చి పట్టువస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. స్థానిక కార్పొరేటర్ స్వరూపరాణి, వేమారెడ్డి, భక్తులు అధిక సంఖ్యలో శివలింగాలను దర్శించుకున్నారు.

టీడీపీ నేత ప్రసాదరావు విస్తృత పర్యటన



అమరనాథరెడ్డిని సన్మానిస్తున్న ప్రసాదరావు

చిత్తూరు సిటీ, మార్చి 11: టీడీపీ నేత, మాజీ ఐఆర్ఎస్ అధికారి దగ్గుమళ్ల ప్రసాదరావు సోమవారం చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. బాపట్ల జిల్లాకు చెందిన ఈయన్ను టీడీపీ అధిష్ఠానం చిత్తూరు ఎంపీ అభ్యర్థిగా నియమించనున్నట్లు తెలిసింది. ఈక్రమంలో ఆయన చిత్తూరు కొంగారెడ్డిపల్లెలో తన కార్యాలయాన్ని మంగళవారం ప్రారంభించనున్నారు. సోమవారం పార్లమెంటు నియోజకవర్గంలోని చంద్రగిరి ఇన్‌చార్జి పులివర్తి నాని, నగరి అభ్యర్థి గాలి భానుప్రకాష్, పూతలపట్టు ఇన్‌చార్జి మురళీమోహన్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కుప్పం టీడీపీ ఇన్‌చార్జి మునిరత్నం, మాజీ మంత్రి అమరనాథ రెడ్డిని వారి ప్రాంతాలకు వెళ్లి కలిసి, సన్మానించారు. యాదమరిలో ఇన్‌చార్జి మురళీమోహన్‌తో కలిసి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని ప్రచారం చేశారు. తిరుపతిలో ప్రసాదరావును మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ సన్మానించారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలి: కలెక్టర్



అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ షన్మోహన్

గంగాధరనెల్లూరు, మార్చి 11: ఎలాంటి పొరపాట్లు లేకుండా అధికారులు ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ షన్మోహన్ అన్నారు. గంగాధరనెల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో జేసీ శ్రీనివాసులు, నియోజకవర్గ ఈఆర్‌వో వెంకటశివ ఆధ్వర్యంలో ఎన్నికల్లో విధులు నిర్వహించే పలు విభాగాల అధికారులు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్, నామినేషన్ల ప్రక్రియపై సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి హేండ్‌బుక్‌ను చదువుకోవడంవల్ల విధులు సక్రమంగా నిర్వహించుకోవచ్చునని తెలిపారు. ఓటర్లకు డబ్బులు, వస్తువులు, మద్యం పంపిణీచేసే సమయంలో ఎఫ్ఎస్‌టీ టీమ్‌లు తప్పనిసరిగా వీడియోలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత నియోజకవర్గంలో ఎక్కడా రాజకీయ నాయకుల బ్యానర్లు, ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లు, గోడలపై రాతలు లేకుండా తొలగించాలన్నారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రవి, ఎన్నికల డీటీ విజయకృష్ణ, ఏఎస్‌వో ఆనందమోహన్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, డీఎస్పీలు, సీఐలు, ఎస్‌హెచ్‌వోలు పాల్గొన్నారు.

మరమగ్గ కార్మికుల కూలీ రేట్లు పెంచాలి: సీఐటీయూ



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న మరమగ్గ కార్మికులు

నగరి, మార్చి 11: నగరి నియోజకవర్గంలోని మరమగ్గ కార్మికులకు కూలీరేట్లను పెంచాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు సోమవారం నగరి ఆర్డీవో, మున్సిపల్ ఛైర్మన్‌కు విడివిడిగా వినతిపత్రాలను అందజేశారు. చిత్తూరు జిల్లా మరమగ్గ కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పెరుమాల్ మాట్లాడుతూ ప్రతి ఏటా కూలీ రేట్లు పెంచుతామని ఆర్డీవో, తహశీల్దారు, జిల్లా లేబర్ అధికారి చర్చలు జరపడం.. అనంతరం గాలికి వదిలేయడం చేస్తున్నారని విమర్శించారు. 2022 ఆగస్టు నెల నుంచి పెంచిన కూలీ ధరలు అమలు చేస్తామని మాస్టర్ వీవర్స్ లిఖిత పూర్వకంగా లేబర్ కమిషనర్‌కు ఆర్డీవో, తహశీల్దార్ తెలిపారని అన్నారు. కానీ నేటికీ పెంచిన కూలీ రేటు ఇవ్వకపోవడంతో తాము ఆర్డీవో, మున్సిపల్ ఛైర్మన్‌కు వినతిపత్రం ఇచ్చామని ఆయన పేర్కొన్నారు. ఇకనైనా నాడు చర్చలు జరిపిన అధికారులు స్పందించి మరమగ్గ కార్మికుల కూలీ రేట్లను పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఐటీయూ నాయకులు జగదీష్, షణ్ముగం, గణపతి, విశ్వనాథ్, మురుగేషన్, విజయమణి పాల్గొన్నారు.

35 ఏళ్లు పైబడిన వారు కంటి పరీక్షలు చేయించుకోవాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్, మార్చి 11: 35 ఏళ్లు పైబడిన వారందరూ విధిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి పిలుపునిచ్చారు. సోమవారం చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో గ్లకోమా వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నేడు చిన్నా, పెద్దా అని తేడా లేకుండా అనేక మంది కంటి జబ్బులతో ఆస్పత్రులకు వస్తున్నారని పేర్కొన్నారు. 40 ఏళ్లు పైబడిన వారైతే తరచుగా కంటి పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అపోలో సూపరింటెండెంట్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

● అవగాహన కార్యక్రమంతోనే ముగించేశారు...

ప్రజలకు కంటికి సంబంధించిన సమస్యలపై అవగాహన కల్పించడమే గ్లకోమా వారోత్సవాల ముఖ్య ఉద్దేశం. అయితే సోమవారం జరిగిన వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కంటి సమస్యల గురించి అన్నీ తెలిసిన నర్సింగ్, వైద్య సిబ్బందితోనే నిర్వహించి, ముగించేశారు. కనీసం నగరంలో ఎక్కడా అవగాహన ర్యాలీగాని, ఇంటింటి ప్రచారం కానీ చేయకపోవడం పట్ల అధికారుల తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పాల్సిన డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి కూడా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

కమనీయంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం



అమ్మవారి మంగళసూత్రాలను చూపుతున్న అర్చకులు

బంగారుపాళ్యం, మార్చి 11: ప్రసిద్ధి చెందిన స్వయంభు కామాక్షి సమేత మొగిలీశ్వరుడి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 7వ రోజైన సోమవారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని ఋత్వికులు కమనీయంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో నిర్వహించిన కల్యాణోత్సవానికి పెద్దఎత్తున భక్తులు విచ్చేసి తిలకించి పులకించారు. అనంతరం ఉత్సవమూర్తులను అశ్వ వాహనంపై ఉంచి మాడవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమానికి చిత్తూరుకు చెందిన న్యాయవాది లోకనాథరెడ్డి, సావిత్రమ్మ కుటుంబసభ్యులు ఉభయదార్లుగా వ్యవహరించారు. ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త ఎంబీ విజయ్‌కుమార్, ఈవో మునిరాజ, భక్తులు పాల్గొన్నారు.

● నేడు బ్రహ్మరథోత్సవం

మొగిలీశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశిష్టమైన బ్రహ్మరథోత్సవం మంగళవారం సాయంత్రం 3 గంటల నుంచి నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు.

నంది వాహనంపై ఊరేగిన కాలభైరేశ్వరుడు



తవణంపల్లె, మార్చి 11: తవణంపల్లె కాలభైరేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న మహాశివరాత్రి వార్షిక ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామివారి నంది వాహన సేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, మహా హారతి సమర్పించారు. సాయంత్రం ఉభయదారులు తవణంపల్లె మొదలియార్ సంఘం ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన నంది వాహనంపై ఉంచి మంగళ వాయిద్యాల నడుమ తవణంపల్లె పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు.

మా జీవనాధారాన్ని పోగొట్టకండి

యాదమరి, మార్చి 11: వంశపారంపర్యంగా రాళ్లు కొట్టి జీవనం సాగిస్తున్న కొండను వన్నియకుల క్షత్రియ భవనానికి కేటాయించడం దారుణమని గాండ్లకొత్తూరు, రామభద్రాపురం, వరిగపల్లె, కుక్కలపల్లె గ్రామస్తులు అన్నారు. వారు సోమవారం కలెక్టర్ షన్మోహన్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మూడు తరాలుగా గుట్టలోనే రాళ్లు కొట్టుకుని జీవనం సాగిస్తున్నామని, ఈ ప్రాంతంలోనే తాము నివాసాలు ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. అయితే ఇటీవల ఆ స్థలాన్ని వన్నియ కులస్థులకు కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించినట్లు తెలిసిందన్నారు. మా జీవనాధారానికి ఆటంకం కలగకుండా చర్యలు చేపట్టి ఆ స్థలాన్ని తమకే కేటాయించాలని వారు కోరారు.

వరసిద్ధుడి సేవలో లోకాయుక్త విశ్రాంత న్యాయమూర్తి



ఐరాల(ఐరాల), మార్చి 11: లోకాయుక్త విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఆనందరెడ్డి సోమవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆయన్ను ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం ఆయన్ను వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.



జనసేన పార్టీ నాయకులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును సోమవారం చిత్తూరులోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరిస్తున్న పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్

రవాణాశాఖ సమస్యలపై తక్షణ పరిష్కారం: ఆర్టీవో

చిత్తూరు సిటీ, మార్చి 11: రవాణాశాఖకు సంబంధించి వాహనదారుల సమస్యలను తక్షణం పరిష్కరిస్తామని ఆర్టీవో సునీల్ కుమార్ చెప్పారు. సోమవారం జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రవాణాశాఖకు సంబంధించి వాహనదారులకు ఎఫ్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్, ఎల్ఎల్ఆర్, వాహనాల ట్రాన్స్‌ఫర్ తదితర ఏవైనా సమస్యలుంటే నేరుగా సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని పత్రాలు సక్రమంగా ఉంటే తక్షణం సమస్య పరిష్కారానికి కృషిచేస్తామని చెప్పారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

నగరి, మార్చి 11: ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని నగరి మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పేర్కొన్నారు. నగరి మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రింటింగుప్రెస్‌లు, ఫ్లెక్సీలు, జిరాక్స్‌సెంటర్, ఇంటర్‌నెట్ సెంటర్ల యజమానులతో ఆయన సమావేశం నిర్వహించారు. కమిషనర్, తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డిలు మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఖర్చుల వివరాలు లెక్కించాల్సి ఉన్నందున అభ్యర్థుల నుంచి రెండు ఆర్డర్‌ఫారంలను ఇద్దరు సాక్షుల సంతకంతో తీసుకోవాలన్నారు. అందులో ఒకటి తహశీల్దార్‌కు, మరొకటి కలెక్టర్‌కు ఇవ్వాల్సి ఉందన్నారు. ముద్రించే కాపీల సంఖ్య, ఆర్డరు ఇచ్చిన వారి పేరు, ముద్రించి ఇచ్చే ప్రతి ఆర్డర్‌కు తప్పనిసరిగా బిల్లులు, ముద్రించే ప్రెస్ పేరు ఉండాలన్నారు. వివాదాస్పద కరపత్రాలు ముద్రించరాదని సూచించారు. టీపీఓ నీరజాక్షి, అన్ని ప్రెస్‌ల యజమానులు పాల్గొన్నారు.

మహిళల పట్ల పాలకుల వైఖరి మారాలి



సమావేశంలో మాట్లాడుతున్న రెహనాబేగం

చిత్తూరు (సెంట్రల్), మార్చి 11: మహిళల పట్ల పాలకుల వైఖరి మారాలని మహిళా వక్తలు పేర్కొన్నారు. సోమవారం యూటీఎఫ్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. పలువురు ఉపాధ్యాయినులు మాట్లాడుతూ మహిళ అనే వివక్ష రాష్ట్రపతి నుంచి వంటగది దాకా ఉంటుందన్నారు. నూతన పార్లమెంట్ భవనానికి, అయోధ్య రామాలయ ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ముర్మును పిలువకపోవడం వివక్ష కాదా అని ప్రశ్నించారు. మహిళలపై పాలకుల వైఖరి మారాలని, అప్పుడే సర్వసమాజం గర్వంగా తలెత్తుకుంటుందన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దీనావతి, సహాధ్యక్షులు రెహనాబేగం, మీనాకుమారి, భువనేశ్వరీ, షకీలా బేగం, సుజని, లీలావతి, రేవతి పాల్గొన్నారు.

రామాలయానికి టీడీపీ నగదు వితరణ



నగదు అందచేస్తున్న టీడీపీ నేతలు

వెదురుకుప్పం, మార్చి 11: వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లె గ్రామ పంచాయతీ దేవళంపేటలో రామాలయం పునర్నిర్మాణానికి గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్, ఎన్ఆర్ఐ కో ఆర్డినేటర్ గురుసాల కిషన్‌చంద్ రూ.25వేలు సోమవారం వితరణ చేశారు. ఈ మొత్తాన్ని ఆలయ ధర్మకర్త సుకుమార్‌కు అందజేశారు. ఆలయ కార్యనిర్వాహకులు దాతలను శాలువ కప్పి సత్కరించారు. నాయకులు పి. మురళీమోహన్, దామోదర్‌రెడ్డి, చెంగ్రాయరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని ఆదరించండి



మాట్లాడుతున్న లాయర్ మణికృష్ణ

పాలసముద్రం, మార్చి 11: రాబోవు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు లాయర్ మణికృష్ణ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పాలసముద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి మహిళకు నెలకు రూ.5 వేలు ఇస్తామని చెప్పారు. డీసీసీ వైస్ ప్రెసిడెంట్ కన్నన్, డీసీసీ మహిళా అధ్యక్షురాలు చందూరాణి, కిసాన్‌సెల్ స్పోక్స్‌పర్సన్ సుబ్బరాయలు, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ కరపత్రాల పంపిణీ

విజయపురం, మార్చి 11: మండలంలోని జగన్నాథపురం, పన్నూరు సబ్‌స్టేషన్, విజయపురం గ్రామాల్లో సోమవారం టీడీపీ సూపర్ సిక్స్ పథకాల గురించి తెలియజేసే కరపత్రాలను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రశేఖర్‌రాజు, చెంచయ్య, మహేంద్రన్, బెంజిమన్, దొరైరాజ్, విజయపురం శ్రీనివాసులు రాజు తదితరులు పాల్గొన్నారు.